
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 2 జనవరి 2025





■ దుర్గమ్మ సన్నిధిలో సీఎం

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఆయనతో కరచాలనం చేసేం దుకు క్యూల్లలోని భక్తులు పోటీ పడ్డారు. ఆయన్ను తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీస్తూ, అభివాదం చేస్తూ ఆనందభరితులయ్యారు. సీఎం చంద్రబాబు కూడా అందరికీ నమస్కారం చేస్తూ ముందుకు సాగారు.



సీఎం చంద్రబాబుకు అభివాదం చేస్తున్న భక్తులు

రూ.11.60 కోట్లు తాగేశారు



ఏడాది ముగింపు వేళ మద్యం ప్రియులు ఫుల్ కిక్కు మీద ఉన్నారు. డిసెంబరు 30,31 తేదీల్లో రూ.11.60 కోట్ల మద్యం తాగేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 13,171 ఐఎంఎల్ కేస్‌లు, 4,402 బీరు కేస్‌లు ఖాళీ చేయడం ద్వారా ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిపించారు. న్యూ ఇయర్ వేడుకలను మద్యం మత్తులో హుషారుగా జరుపుకున్నారు.

2024 డిసెంబరు 30, 31వ తేదీల్లో ఫుల్ కిక్కు..!

న్యూ ఇయర్ వేళ భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు

- 13,171 ఐఎంఎల్ కేస్‌లు, 4,402 బీరు కేస్‌లు ఖాళీ
- ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో మంగళవారం ఒక్కరోజే రూ.11.60 కోట్ల అమ్మకాలు సాగాయి. డిపోల నుంచి 13,171 ఐఎంఎల్ కేసులు, 4,396 బీరు కేస్‌లను మద్యం దుకాణాలు కొనుగోలు చేశాయి. 30వ తేదీన 26,304 ఐఎంఎల్ కేస్‌లు, 5,596 బీరు కేస్‌లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్లు, అమ్మకాల్లో ఎన్టీఆర్ జిల్లా టాప్‌లో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లాలో మద్యం దుకాణాలు మంగళవారం డిపోల నుంచి 8,294 ఐఎంఎల్ కేస్‌లు, 2,936 బీరు కేస్‌లు కొనుగోలు చేశాయి. వాటి ద్వారా మొత్తం రూ.7.7 కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖకు వచ్చింది. దీనికి ముందు 30వ తేదీన 15,247 ఐఎంఎల్ కేస్‌లు, 2,880 బీరు కేస్‌లను మద్యం వ్యాపారులు డిపోల నుంచి కొనుగోలు చేశారు. వాటి ద్వారా రూ.13.03 కోట్ల ఆదాయం వచ్చింది. కృష్ణాజిల్లాలో 31వ తేదీన 4,877 ఐఎంఎల్ కేస్‌లు, 1,466 బీరు కేస్‌లను కొనుగోలు చేశారు. వాటి ద్వారా రూ.3.9 కోట్ల ఆదాయం వచ్చింది. 30వ తేదీన 11,057 ఐఎంఎల్ కేస్‌లు, 2,716 బీరు కేస్‌లను డిపోల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. వారి ద్వారా రూ.8.50 లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు చేకూరింది. సంవత్సరం ముగింపు రెండు రోజుల్లో జిల్లాలోని మద్యం ప్రియులు ఈ కేస్‌లను ఖాళీ చేశారు. ఏడాది ముగింపు రోజున జిల్లాలో విస్తృతంగా విందులు చేసుకున్నారు. అటు బార్లు, ఇటు మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. కొన్నిచోట్ల గ్రూపులుగా పార్టీలు చేసుకున్నారు. ఈ లిక్కర్ కిక్ నూతన సంవత్సరం తొలి రోజున సాగింది.

ఐఎంఎల్‌కు అధిక ప్రాధాన్యం

సాధారణంగా మద్యం అమ్మకాల్లో బీరుల వాటా అధికంగా ఉంటుంది. వేసవిలో చల్లదనం కోసం బీరులను విపరీతంగా తీసుకుంటారు. అయితే ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉండడంతో మద్యం ప్రియులు బీరుల మోతాదును తగ్గించుకున్నారు. లిక్కర్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. చల్లని రోజుల్లో వెచ్చదనం కోసం లిక్కర్‌ను ఎంచుకున్నారు. రెండు రోజులపాటు డిపోల నుంచి కొనుగోలు చేసిన కేసులో ఐఎంఎల్ కేస్‌లే ఎక్కువ ఉన్నాయి. రెండు రోజుల్లో డిపోల నుంచి మద్యం వ్యాపారులు 39,475 ఐఎంఎల్ కేస్‌లు కొనుగోలు చేయడం గమనార్హం.

వైసీపీ శ్రేణుల హడావిడి



బందరు తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద వైసీపీ కార్యకర్తలు

మేయర్ కారులో విచారణకు హాజరైన పేర్ని జయసుధ

రెండున్నర గంటలపాటు సాగిన విచారణ ● అంతా మేనేజర్‌కే తెలుసు... నాకేమీ తెలియదని వెల్లడి

ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం : పీడీఎస్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి పేర్ని జయసుధ పోలీసుల విచారణకు హాజరైన సమయంలో వైసీపీ కార్యకర్తలు హడావిడి చేశారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్‌కు ప్రభుత్వం కేటాయించిన కారులో పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధ పోలీస్ స్టేషన్‌కు రావడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ కారులో ఏ1ను ఎలా తీసుకువస్తారనే విషయమై విమర్శలు వినిపించాయి. విచారణ వచ్చిన పేర్ని జయసుధతోపాటు మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మీ తదితరులు ఆమెతోపాటు స్టేషన్‌లోనే ఉన్నారు. పేర్ని జయసుధ విచారణ నిమిత్తం తాలూకా పోలీస్‌స్టేషన్‌కు రావడంతో వైసీపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్ వద్దకు తరలివచ్చారు. రెండున్నర గంటలపాటు విచారణ కొనసాగడంతో అనారోగ్యంతో ఉన్న మహిళను ఎంతసేపు విచారణ చేస్తారంటూ వైసీపీ నాయకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. విచారణ జరిగే సమయంలో ఆమె ఏమైనా ఇబ్బందులు పడుతున్నారనే అంశంపై వైసీపీ నాయకులు పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు తలుపులు తెరచి పేర్ని జయసుధతో తానేమీ ఇబ్బంది పడటంలేదని చెప్పించాల్సి వచ్చింది. ఎస్సై సత్యనారాయణ ఆమె బాగానే ఉన్నారని, ఎవరూ కంగారుపడవద్దని చెప్పారు. అయినా వారు సమాధానపడకుండా 'మీకేమీ కంగారు ఉండదని, మా క్లయింట్ విషయంలో మాకు కంగారు ఉంటుందని' లాయర్ అంకబాబు వ్యాఖ్యానించారు.పెద్దఎత్తున వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకురావడంతో వారందరిని దూరంగా పంపే ప్రయత్నం పోలీసులు చేశారు. పేర్ని జయసుధ విచారణ సుమారు రెండున్నర గంటలపాటు సాగింది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆమె పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం 4.30 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్నారు. రాబర్ట్‌సన్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐ ఏసుబాబు, మచిలీపట్నం తాలూకా స్టేషన్ ఎస్సై సత్యనారాయణ ఆమెను విచారించారు. ఈ సమయంలో పేర్ని జయసుధ తరపు న్యాయవాదులు వరదరాజులు, అంకబాబు అక్కడే ఉన్నారు. గోడౌన్ వివరాలు, ఎవరి పేరున ఉంది, నగదు లావాదేవీలు ఎవరు చూసేవారు, తదితర అంశాలపై పోలీస్ అధికారులు వివరాలు రాబట్టారు. గోడౌన్ వ్యవహారాలు తాను చూడలేదని, కేవలం గోడౌన్ యజమానిగా మాత్రమే తాను ఉన్నానని, గోడౌన్ మేనేజర్ మానస్ తేజ మొత్తం వ్యవహారాలు చూసేవారని, తనకేమీ తెలియదని పేర్ని జయసుధ పోలీస్ అధికారులకు చెప్పినట్టు సమచారం. ఈ కేసు విచారణ నిమిత్తం అవసరమైతే మళ్లీ పోలీస్ స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని పోలీస్ అధికారులు పేర్ని జయసుధకు తెలిపారు.

11 రోజులు.. 294 స్టాళ్లు

నేడు విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభం

- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఏర్పాటు
- ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



పుస్తక మహోత్సవ బుక్ స్టాల్‌లో పుస్తకాలను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 35వ విజయవాడ పుస్తక మహోత్సవం గురువారం నుంచి ప్రారంభం కానుంది. 12వ తేదీ వరకు పుస్తకాల ప్రదర్శనలు జరుగనున్నాయి. ప్రచురణకర్తల కోసం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 294 స్టాల్స్‌ను ఏర్పాటు చేసింది. దేశంలో ప్రఖ్యాతిగాంచిన ఇంగ్లీషు ప్రచురణకర్తలు ఈసారి అధిక సంఖ్యలో రాబోతున్నారు. పుస్తక ఆవిష్కరణల కోసం ఒక వేదికను, బాలల ప్రతిభను కనబరిచే కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు మరో వేదికను సిద్ధం చేశారు. ప్రధాన వేదికకు చెరుకూరి రామోజీరావు వేదిక అని నామకరణం చేయగా, బాలల ప్రతిభ వేదికకు రతన్ టాటా పేరును పెట్టారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో ప్రముఖ కవులు, రచయితల జయంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీనితో పాటు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాలు జరగనున్నాయి.





కృష్ణానది నీరుపారే దేవరపల్లి ఇసుక పాయలో సొసైటీ భూములుగా సర్వే చేసి హద్దులు పాతారని చూపుతున్న రైతు బాబూరావు

దేవరపల్లి సొసైటీలో బుసక, రెల్లి దుబ్బులతో నిరుపయోగంగా ఉన్న సొసైటీ భూములు

గండ్ర ఇసుకను కొల్లగొట్టేందుకే..

- దేవరపల్లి ఎస్సీ సొసైటీ భూముల్లోని బుసక వ్యవహారంలో కుట్రకోణం
- మూడు మీటర్ల లోతు ఇసుకపైనే వారి గురి

- సొసైటీ సభ్యుల మేలు కోరితే రెల్లి తొలగించి బుసక తవ్వాలి
- అలా కాకుండా నదీపాయలో ఇసుకలో సర్వే చేయటమేంటి?
- తెరవెనుక ఉండి కథ నడిపిస్తున్న పెద్ద తలకాయలు

(తోట్లవల్లూరు-ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ఎస్సీ సొసైటీ భూముల్లోని బుసక వ్యవహారంలో పెద్ద కుట్రే దాగి ఉంది. దీని వెనుక పెద్దపెద్ద తలకాయలు ఉన్నట్టు స్పష్టమవుతోంది. ప్రజాప్రతినిధులు తెరవెనుక ఉండి వైసీపీకి చెందిన ఓ హంతకుడితో కథ నడిపిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సొసైటీ కింద 42 ఎకరాల భూములుంటే అందులో సగ భాగం పంటల సాగులో ఉండగా, మిగిలిన సగ భాగం మీటరు ఎత్తున బుసక వేసి దట్టంగా రెల్లి దుబ్బులు పెరిగి ఉన్నాయి. సొసైటీ సభ్యుడు దేవరపల్లి బాబూరావు విలేకరులను తీసుకెళ్లి స్పష్టంగా వివరించి చెప్పాడు. ఈ బుసక, రెల్లి తొలగించి భూమిని చదును చేస్తే పంటలు పండించుకునే అవకాశం సభ్యులకు కలుగుతుందన్నారు. బుసక తవ్వకాలకు మొదటగా 40 ఎకరాలకు దరఖాస్తు చేయగా ఇద్దరు సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటం జరిగింది. దాంతో తాము సొసైటీ భూముల జోలికి రావటం లేదని, మీకు నష్టం కలిగించబోమని చెప్పి 12 ఎకరాలకు తగ్గించి ప్రక్కనే ఉన్న నదీపాయలోని గండ్ర ఇసుకను కొల్లగొట్టేందుకు వ్యూహాన్ని రచించారనే విమర్శలు వచ్చాయి.

సొసైటీ భూముల కిందకు రాదంటూనే..

సొసైటీ భూములు సర్వే నంబరు 190లో ఉన్నాయి. ఇసుక పాయకూడా ఆ సర్వే నంబరులోనే ఉందని చెప్పి ఈ నెల 17న అధికారులు సర్వే నిర్వహించి హద్దులు వేశారు. ఇది 190 సర్వే నంబరులో ఉన్నా దళితులకిచ్చిన సొసైటీ భూముల కిందకు రాదని చెబుతున్నారు. కృష్ణానదీపాయలోనే సరిహద్దులు వేశారని, ఇక్కడ ఇసుక మూడు మీటర్ల వరకు తీస్తే వరదల సమయంలో పక్కనే ఉన్న సొసైటీ భూములు కోతకు గురవుతాయని బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు.

అక్కడ తవ్వితే ఇక్కడి భూములు సాగులోకి ఎలా వస్తాయి?

అయితే ఒకరిద్దరు మాత్రమే వ్యతిరేకిస్తున్నారని, సొసైటీ సభ్యులందరు వెంకటస్వామిని మిగతా 6లో

ఎన్‌హెచ్ 'ధన'కార్యం

పశ్చిమ బైపాస్ వ్యవహారంలో డెమరేజ్ చార్జీల కింద రూ.14 కోట్లు చెల్లింపు

జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ఆర్‌వో కార్యాలయం వెలగబెట్టిన 'ధన' కార్యం తాజాగా హైకోర్టు సాక్షిగా మరోసారి బయటపడింది. విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పునకు సంబంధించిన వివాదంలో విద్యుత్ అంతరాయం కారణంగా తలెత్తిన లైన్‌లాస్ నష్టానికి డెమరేజ్ చార్జీల కింద జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ఆర్‌వో కార్యాలయం రూ.14 కోట్లు చెల్లించింది. ఎవరికి చెల్లించిందన్నది బయటకు రాలేదు. ల్యాంకో తానే యజమానినని వాదిస్తుంటే, మరోవైపు దీనిలో ఒక యూనిట్‌ను కొన్న రాధా టీఎంటీ సంస్థ కూడా తానే యాజమానినని వాదిస్తోంది. ఇరువర్గాల లాయర్లు న్యాయ స్థానంలో యాజమాన్య హక్కులపై వాదులాటకు దిగటం ఉమ్మడి కృష్ణాజిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.

నగదు తీసుకున్న సంస్థ పేరు బయటపెట్టకుండా ఆర్‌వో కార్యాలయం నాటకం

- దీనిపై ఇటీవల హైకోర్టును ఆశ్రయించిన రైతులు
- అక్కడ ల్యాంకో, రాధా టీఎంటీల యాజమాన్య వివాదం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు, ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పునకు సంబంధించిన వివాదంపై హైకోర్టులో రైతులు వేసిన రిట్ పిటిషన్ తాజాగా విచారణకు వచ్చింది. ల్యాంకో తరఫున లిక్విడేటర్ లాయర్‌తో పాటు, మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్‌లో ఒక యూనిట్‌ను కొనుగోలు చేసిన రాధా టీఎంటీ తరఫున లాయర్ కూడా వాదనలు వినిపించారు. రైతుల కేసుకు సంబంధించిన అంశంలో ఆయా సంస్థల న్యాయవాదుల వాదనలకు హైకోర్టు న్యాయమూర్తి సైతం విసుగు చెందారు. లాయర్ల వాదనలు చూస్తే వాటి యాజమాన్య హక్కులకు సంబంధించిన వివాదంగా మారిపోయింది. దీంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. ఇది మీ యాజమాన్య వివాదం కాదని, రైతుల అంశమని న్యాయమూర్తి స్టే విధించారు. మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్ ద్వారా విద్యుదుత్పత్తి జరగనపుడు కోట్ల రూపాయలను ఎలా చెల్లించింది? ఎందుకు చెల్లించాల్సి వచ్చింది ? ఎవరికి చెల్లింపులు చేసింది ? వంటివి ఈ సందర్భంగా హైకోర్టు దృష్టికి వచ్చాయి.

రహస్యంగా నగదు చెల్లింపు విషయం

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూతపడక ముందు ట్రాన్స్‌మిషన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పుకు ఆ సంస్థ ఇచ్చిన ప్రతిపాదన ఆధారంగా రూ.32.58 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్ అధికారులు టెండర్లు పిలిచారు. ల్యాంకో మూతపడిన తర్వాత డెమరేజ్ చార్జీల కింద ఎన్‌హెచ్ ఆర్‌వో కార్యాలయం రూ.14 కోట్ల మేర చెల్లింపులు చేసింది. ఎవరికి చెల్లించిందన్నది మాత్రం ఎన్‌హెచ్ ఆర్‌వో కార్యాలయం రహస్యంగా ఉంచింది. రైతులు అనేక మార్లు సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినా ఎన్‌హెచ్ ఆర్‌వో కార్యాలయం ఇవ్వలేదు. ఆ తర్వాత రైతుల పిల్‌కు సమాధానంగా ల్యాంకో పేరుతో చెల్లించినట్టుగా సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.

యాజమాన్య హక్కులు తమవేనంటూ వాదనలు

ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడ్డాక ఆ సంస్థ తమ ప్లాంట్‌ను ఆక్షన్ వేసింది. పవర్ ప్లాంట్‌ను నాలుగు భాగాలుగా విభజించి ఆక్షన్ వేసినట్టుగా హైకోర్టులో ల్యాంకో లిక్విడిటేర్ తరఫున న్యాయవాది చెప్పారు. ఆయన ఇంకో ముఖ్యమైన విషయం కూడా వెల్లడించారు. ట్రాన్స్‌మిషన్ టవర్ల లైన్‌ను మయన్మార్ దేశానికి చెందిన సంస్థకు విక్రయించినా ఆ సంస్థ పూర్తిగా డబ్బులు చెల్లించలేదని, దీనిపై తాము నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు వెళ్లామని కేసు మిగతా 6లో..

గడ్డం గ్యాంగ్ కాళీకి రిమాండ్

- మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై హత్యాయత్నం కేసులో అరెస్టు
- నెల్లూరు జైలుకు తరలింపు
- అదే జైల్లో ఈ కేసులోని మరో 13 మంది నిందితులు
- పరారీలో మరో నిందితుడు కూచిపూడి శ్రీను

6లో

భూముల ధరలపై రివిజన్ షెడ్యూల్!

- 10 నుంచి రీ వెరిఫికేషన్
- సబ్ రిజిస్ట్రార్లపై పనిభారం

6లో

న్యూ ఇయర్ జోష్‌లో అపశ్రుతి

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

6లో



కుటుంబసభ్యులతో దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.సి.డి. శేఖర్, బి.కృష్ణమోహన్, జస్టిస్ రవినాథ్ తిల్హరిలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస్ శాస్త్రి, ఆలయ ఉద్యోగులు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

వన్‌టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో బుధవారం కనకదుర్గమ్మను పలువురు హైకోర్టు న్యాయమూర్తులు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వీరికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టీసిడి శేఖర్, జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు, జస్టిస్ రవినాథ్ తిల్హరి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డి.వెంకటరమణ, తదితరులు ఉన్నారు.



మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకట రమణకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గగుడికి భక్తుల తాకిడి..

వన్‌టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకోవటానికి బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, కొండదిగువన భక్తుల తాకిడితో కిటకిటలాడింది. బుధవారం తెల్లవారుజామునుంచే ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావటంతో క్యూలు, ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. మరో



దుర్గగుడిలో భక్త జన సందోహం

వైపు వీఐపీలతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. భక్తుల తాకిడితో దుర్గగుడి, ఘాట్‌రోడ్డు వాహన రాకపోకలకు నిలిపివేసి కేవలం వీఐపీ వాహనాలను అనుమతించారు. దీంతో కొండ దిగువన కనకదుర్గానగర్, బొడ్డుబొమ్మ సెంటర్, హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా జాతీయ రహదారి ఇరువైపుల వాహనాలతో రద్దీ ఏర్పడింది. దీంతో భక్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కనకదుర్గానగర్ ద్విచక్ర వాహనాలతో పూర్తిగా నిండిపోయింది. దుకాణాలు, వివిధ కౌంటర్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్, తాజా మాజీ ఈవో కె.ఎస్.రామారావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

దర్గా వద్ద ట్రాఫిక్ జామ్

రథం సెంటర్ దర్గా సమీపంలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ స్తంభించింది. రథం సెంటర్ వైపు.. కనకదుర్గానగర్‌కు వచ్చే వాహనాలు ఎదురు రావటంతో ట్రాఫిక్ స్తంభించింది. అదే ప్రాంతంలో ఆటో స్టాండ్ ఉండటం వల్ల ఆటో డ్రైవర్లు రోడ్డుమీద వాహనాలు నిలిపి భక్తులను ఆటోల్లో ఎక్కించడంతో ట్రాఫిక్ స్తంభించింది.

పెదఅవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో..



దివ్యపూజను సమర్పిస్తున్న రెవ. ఫాదర్ మరియదాసు

ఉంగుటూరు : నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు, చర్చిలు, ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో సుఖసంతోషాలతో, అన్నీ శుభాలు కలగాలని భగవంతుని వేడుకుంటూ ప్రజలు ఆయా ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ కతోలికా క్షేత్రమైన బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేరీమాత కపూచియన్ ప్రావిన్స్(ఏనికేపాడు)ప్రావెన్షియల్ రెవ.ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు దివ్యపూజలు సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



కామధేనువు విగ్రహావిష్కరణలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు తదితరులు

కామధేనువుతో సకల శుభాలు

- కృష్ణామిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు
- ఆవు, దూడ కామధేనువు విగ్రహావిష్కరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సనాతన సాంప్రదాయాన్ని అనుసరించి కామధేనువు ఉన్న చోట సకల శుభాలు కలుగుతాయని ఆదే విధంగా ప్రాజెక్ట్ కామధేను(విజయ పాల ఫ్యాక్టరీ)తో పాడిరైతులకు సకల శుభాలతో పాటు ఆర్థికాభివృద్ధి జరగాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆకాంక్షించారు. వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(కృష్ణామిల్క్ యూనియన్)పాల ఫ్యాక్టరీలో బుధవారం ఆవు, దూడ(కామధేనువు) విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులకు పశుపోషణతో పాడి ద్వారా నిరంతర ఆదాయం అంది ఆర్థిక చేయూత కలుగుతోందని, అందుకే 1.50లక్షల పాడి రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి చేయూతనందించే యూనియన్ గుర్తుగా కామధేనువును ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఆశాజ్యోతి దివ్యాంగ సొసైటీలో దివ్యాంగులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. దివ్యాంగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, ఆపరేషనల్ జీఎం లక్ష్మణరావు, ప్లాంట్ మేనేజర్ సరిత, జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిన్నమనేని లక్ష్మీప్రసాద్, గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, కొల్లి వెంకట్రావు, పలువురు సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, సిబ్బంది, ఆశాజ్యోతి నిర్వాహకులు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మామిడి ఎగుమతులు ప్రారంభం

విస్సన్నపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విస్సన్నపేట మండలం నుంచి ముంబైకు మామిడి ఎగుమతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. విస్సన్నపేట చిట్టూ మ్యాంగో మార్కెట్ నుంచి తోతాపురి 20 టన్నులు ముంబై మార్కెట్‌కు ఎగుమతి చేసినట్టు మార్కెట్ నిర్వాహకులు రాయల సత్యనారాయణ(కిట్టు) తెలిపారు. టన్ను తోతాపురి రూ.70వేలు ధర పలుకుతుందన్నారు. ప్రస్తుతం మామిడి ధర ఆశాజనకంగా ఉందన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్ఈ

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి గురువారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీడీసీఎల్ ఎస్ఈ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినియోగదారులు 0866 2575620 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

భూముల ధరలపై రివిజన్ షెడ్యూల్!

- 10 నుంచి రీ వెరిఫికేషన్
- సబ్ రిజిస్ట్రార్లపై పనిభారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

భూముల ధరల సవరణకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్లకు మరోమారు రివిజన్ షెడ్యూల్ విడుదలైంది. తాజా షెడ్యూల్ ప్రకారం జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వరకు చేయాల్సిన విధులను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఈ రివిజన్ షెడ్యూల్ ప్రకారం రీ వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. జనవరి 10వ తేదీ నుంచి పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో రెవెన్యూ, మునిసిపల్, పంచాయతీ అధికారులతో కలిసి ఏవైతే భూములు పెంచాలని అనుమతి ఇచ్చారో వాటిని రీ వెరిఫికేషన్



చేయాల్సి ఉంటుంది. జనవరి 17 నాటికి సవరించిన రేట్లకు సంబంధించి అనుమతించిన వాటిని కమిటీ ముందుకు తీసుకురావాలి. జనవరి 18న వెబ్‌సైట్‌లో వాటి రేట్లను ఉంచి ప్రజల నుంచి అభ్యంతరాలను తీసుకోవాల్సి ఉంటుంది. జనవరి 24న అభ్యంతరాలకు సంబంధించిన గ్రీవెన్స్ నిర్వహించాల్సి ఉంది. జనవరి 25న కమిటీ నేతృత్వంలో పెంచిన రేట్లను ఆమోదించాల్సి ఉంటుంది. జనవరి 27నాటికి డేటా ఎంట్రీని పూర్తి చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి పెంచిన రేట్లను అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే చేసిన పనే మళ్లీ చేయాల్సి వస్తోందని, సంక్రాంతి పండగ కూడా చేసుకోనివ్వరా అంటూ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే భూముల రేట్ల సవరింపుకు సంబంధించి రెండు దఫాలుగా కసరత్తులు చేశామని, గ్యాప్ వచ్చిన ప్రతిసారీ రివిజన్ షెడ్యూల్ పేరుతో పనిభారాన్ని మోపుతున్నారని అల్లాడిపోతున్నారు. ఇప్పటికే షెడ్యూల్‌ను సవరించటం, అభ్యంతరాలను కూడా తీసుకోవటం జరిగిందని మళ్లీ అభ్యంతరాల స్వీకరణకు షెడ్యూల్‌ను నిర్ణయించటం ఏమిటని వాపోతున్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా జాస్తి సత్యనారాయణ

కృష్ణలంక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ చైర్మన్‌గా జాస్తి సత్యనారాయణ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శాఖ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. డిసెంబరు 31వ తేదీన రెడ్‌క్రాస్ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీకి పదిమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపింది. జాస్తి సత్యనారాయణ చౌదరి, డాక్టర్ వి.నారాయణరావు, కొల్లి నాగేశ్వరరావు, పి.సాయిబాబా, అట్లూరి సుమబిందు, మన్యం



కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమైన రెడ్‌క్రాస్ సభ్యులు

వెంకట జగన్నాథ్, డాక్టర్ ఇళ్ల రవి, బి.అనిల్‌కుమార్, డాక్టర్ బి.శివహరిప్రసాద్, శీతల్ జైన్‌లు నూతన సభ్యులుగా ఎన్నికకాగా, బుధవారం రెడ్‌క్రాస్ కార్యాలయంలో సమావేశమై జాస్తి సత్యనారాయణ చౌదరిని చైర్మన్‌గా, డాక్టర్ వి.నారాయణరావును వైస్ చైర్మన్‌గా, డాక్టర్ ఇళ్ల రవిని ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపింది. కొత్తగా ఎన్నికైన సభ్యులకు రెడ్‌క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు.

బ్యాంకర్లు బెదిరిస్తున్నారు!

- టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో కాలనీ లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి బ్యాంకర్లు తాళాలు వేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి నుంచి తమను కాపాడాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ కోరారు. బుధవారం గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీ సీ-41బ్లాక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకర్లు లబ్ధిదారులను బెదిరించి నోటీసులిస్తున్నారని, రోజు 10 సార్లు ఫోన్లు చేసి దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. వారి ప్రయత్నాలు తిప్పికొడతామని, ఐక్యతతో పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కమిటీ ఉపాధ్యక్షుడు సంబంగి రంగమ్మ, సభ్యులు రంగారావు, రాంబాబు, ఆదినారాయణ, మేరమ్మ, మాధవి, శైలజ, గణేష్, కాలనీవాసులు లక్ష్మీ, వరలక్ష్మీ, సామ్రాజ్యం, ధనలక్ష్మీ, నాగలక్ష్మీ, రత్నకుమారి, అప్పారావు, విజయలక్ష్మీ పాల్గొన్నారు.



టిడ్కో కాలనీలో ధర్నా చేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే వెనిగండ్లకు వినతి

టిడ్కో కాలనీ లబ్ధిదారులను రుణవిముక్తుల్ని చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ కోరారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల స్వగృహంలో ఆయన్ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి టిడ్కో గృహాల విషయంలో ఇచ్చిన హామి మేరకు రుణమాఫీ చేయించాలని ఎమ్మెల్యే వెనిగండ్లకు విజ్ఞప్తి చేశారు. కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ నూరు స్నీసా, సభ్యులు రంగారావు, గణేష్, రాంబాబు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ధనకార్యం

(5వ పేజీ తరువాయి)

నడుస్తోందని చెప్పారు. ఈ అలైన్‌మెంట్‌కు తామే యజమానులమని హైకోర్టుకు తెలియజేశారు. మరోవైపు రాధా టీఎంటీ సంస్థ కూడా ఈ లైన్‌కు తామే యజమానులమన్న వాదనలు వినిపించింది. మయన్మార్ కంపెనీ, రాధా టీఎంటీలు అంతర్గతంగా చేసుకున్న ఒప్పందం మేరకు ఈ వాదనలు తీసుకువచ్చిందా అన్నది తెలియాల్సి ఉంది. ల్యాంకో లిక్విడేటర్, రాధా టీఎంటీ లాయర్ల వాదనల నేపథ్యంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని ఎవరికీ లైసెన్స్ లేదు.. యజమాని ఎవరో తెలియదు అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో రైతుల తరఫున న్యాయవాదులు మెదమల్లి బాలాజీ, సాయి సూర్యతేజలు బలంగా వాదనలు వినిపించడంతో దాదాపుగా 12 కేసులకు స్టే లభించింది. ఇక ఒకే ఒక్క కేసు మాత్రమే మిగిలి ఉంది. ఈ కేసుల తుది విచారణలో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ఆర్వో కార్యాలయం ఉన్నతాధికారుల బండారం బయట పడే అవకాశం ఉంది. హైకోర్టు అభిప్రాయపడినట్టుగా లైసెన్స్ లేని సంస్థ, యజమాని ఎవరో తెలియని సంస్థలకు రూ. 14 కోట్ల ప్రజా ధనాన్ని సంతర్పణ చేశారన్నది అర్థమవుతోంది. ఎన్‌హెచ్ ఆర్వో కార్యాలయం ఉన్నతాధికారుల తీరుపై ఇప్పటికే రైతులు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ రంగంలోకి దిగింది. మరోవైపు కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యాలయం, ప్రధాన మంత్రి కార్యాలయం కూడా ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఏ ఉద్దేశంతో ఈ చెల్లింపులు చేశారు? ఎవరి ప్రయోజనాల కోసం చేశారు? ఈ వ్యవహారంలో ఎవరి వాటాలు ఎంత? అన్నది మరికొద్ది రోజుల్లో తేలనుంది.



విజేతలను ప్రకటిస్తున్న సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి, హాజరైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

సోనోవిజన్ లక్కీడ్రా విజేతలు వీరే..

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ షోరూం సోనోవిజన్ లక్కీడ్రా ద్వారకా నగర్‌లోని డైమండ్ పార్కు వద్ద గల సంస్థ షోరూంలో బుధవారం జరిగింది. సాయంత్రం 7.00 గంటలకు జరిగిన కార్యక్రమంలో హోండా అమేజ్ కారు, రెండు 55 ఇంచెస్ ఎల్ఈడీ టీవీలు, రిఫ్రిజిరేటర్ విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. వందలాది కొనుగోలుదారుల సమక్షంలో లక్కీడ్రా విజేతలను ఎంపిక చేశారు. లక్కీడ్రాలో హోండా అమేజ్ కారును కూపన్ నెం. 015641 గాజువాకకు చెందిన సీహెచ్ వి రమణ దక్కించుకోగా, 55 ఇన్‌చెస్ ఎల్ఈడీ టీవీలను (కూపన్ నెం. 26709) మద్దెల పాలెంకు చెందిన ఎం.గుణసుందరి, (కూపన్ నెం.40939) తాటిచెట్లపాలెంకు చెందిన సతీష్ కుమార్‌లు గెలుచుకున్నారు. రిఫ్రిజిరేటర్‌కు (కూపన్ నెం. 91463) సీతమ్మపేటకు చెందిన సీహెచ్ రమేష్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ భాస్కరమూర్తి మాట్లాడుతూ, అత్యంత తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌ను సోనోవిజన్‌లో అందిస్తున్నట్టు తెలిపారు. ఏపీలో అతి పెద్ద ఎలక్ట్రానిక్ చైన్ స్టోర్ సోనోవిజన్‌లో అని, తమ వద్ద అన్ని పెద్ద కంపెనీల ఎల్ఈడీ, మొబైల్స్, ల్యాప్ టాప్స్, రిఫ్రిజిరేటర్స్, వాషింగ్ మెషిన్స్ ఏసీ, ఇంకా కిచెన్ అప్లయెన్సెస్ అధిక డిస్కౌంట్‌తో లభిస్తున్నాయన్నారు. 22.5% వరకు క్యాష్ బ్యాక్ ఈసారి ప్రత్యేకత అని, ఒక ఈఎంఐ రిఫండ్ ఇంకా అనేక ఆఫర్స్ అందిస్తున్నామన్నారు.

విభిన్న పాత్రలతో హీరోగా నిరూపించుకుంటా

- యువ నటుడు ధర్మ మహేశ్

హనుమాన్‌జంక్షన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విభిన్న కథాంశాలతో కథానాయకుడుగా నటనలో నిరూపించుకోవాలన్నదే తన కోరిక అని హనుమాన్‌జంక్షన్‌కు చెందిన వర్ధమాన నటుడు, డ్రింకర్ సాయి చిత్ర కథానాయకుడు కాకాని ధర్మమహేశ్ అన్నారు. గతేడాది డిసెంబరు 27న విడుదలైన 'డ్రింకర్ సాయి' చిత్రం విజయోత్సాహాన్ని నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కుటుంబసభ్యులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన రెండో సినిమా 'డ్రింక్ సాయి' అనుకున్నట్టే ప్రేక్షకాదరణ లభిస్తున్నదన్నారు. తనకు అవకాశం ఇచ్చిన నిర్మాత, దర్శకులు, సాంకేతిక నిపుణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపేరు ధర్మ మహేశ్ అయినప్పటికీ సినిమాలో పాత్ర పేరు సాయిగా పిలవడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రేక్షక అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మమహేశ్‌ను హీరోగా ఆశీర్వదించిన అభిమానులు, హనుమాన్‌జంక్షన్ ప్రజానీకానికి ఆయన తల్లిదండ్రులు కాకాని బాబు, అరుణ కృతజ్ఞతలు తెలియజేశారు.



తల్లిదండ్రులతో యువ కథానాయకుడు ధర్మ మహేశ్

న్యూ ఇయర్ జోష్‌లో అపశృతి

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తోట్లవల్లూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఇయర్ జోష్ కోసం మద్యం సేవించిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన యాకమూరు సమీపంలో జరిగింది. పమిడిముక్కల మండలం మంటాడ బీసీ కాలనీకి చెందిన బోయ వీరబాబు(18) స్నేహితుడితో కలిసి డిసెంబర్ 31 రాత్రి తోట్లవల్లూరు మండలంలోని గరికపర్రు వద్ద ఖాళీ ప్రదేశంలో మద్యం సేవించారు. అనంతరం బైక్‌పై ఉయ్యూరు వైపు వస్తుండగా యాకమూరు వద్ద మలుపులో దూళిపూడిపాలెంకు చెందిన శివ భాస్కర్, సుజన దంపతులు ఎదురుగా బైక్‌పై వస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న వీరబాబు బైక్‌తో అతివేగంగా దంపతుల బైక్‌ను ఢీకొట్టగా తలకు బలమైన గాయమైంది. వెంటనే వీరబాబును ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతు బుధవారం మృతిచెందాడని ఎస్సై ఎం.అర్జునరాజు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో కాళీకి రిమాండ్

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అనుచరుడు, గడ్డం గ్యాంగ్ లీడర్, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెరుగుమాల కాళీ కటకటాల పాలయ్యారు. 2022 డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ రోజున మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై కాళీ అతని గడ్డం గ్యాంగ్ పెట్రోసంచులు, కర్రలు, రాడ్లతో హత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఈ కేసులో



కాళీని వైద్య పరీక్షలకు తీసుకువెళుతున్న పోలీసు సిబ్బంది

13మంది గడ్డం గ్యాంగ్ బ్యాచ్ నెల్లూరు జైలులో ఉన్నారు. మంగళవారం అస్సాం రాష్ట్రంలో కాళీని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసారు. బుధవారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఏ.జె.ఎఫ్.సి.ఎం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 10రోజులు రిమాండ్ విధించారు. కాళీని నెల్లూరు జైలుకు తరలించారు. మరో నిందితుడు కూచిపూడి శ్రీను అలియాస్ జిమ్ శ్రీనులు పరారీలో ఉన్నారు. త్వరలోనే శ్రీను కూడా అరెస్టు చేస్తామని వన్‌టౌన్ సి.ఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

గండ్ర ఇసుక కొల్లగొట్టేందుకే..

(5వ పేజీ తరువాయి)

బుసక తవ్వమని కోరామని కొందరు సభ్యులు మీడియా సమావేశంలో చెప్పటం గమనార్హం. మా భూములు సాగులోకి రావాలన్నతదే తమ తపన అని సభ్యులైన దేవరపల్లి చంద్రశేఖర్, దేవరపల్లి నాగరాజు చెప్పుకొచ్చారు. వారి వాదన ప్రకారం నదీపాయలో ఇసుక తవ్వితే సొసైటీ భూముల్లో బుసక, రెల్లి ఎలా తొలగిపోతుందని, భూములు సాగులోకి ఎలా వస్తాయని బాబూరావు ప్రశ్నిస్తున్నాడు.

అధికార పార్టీ నేతల హస్తం!

రెండు రోజులుగా ఇక్కడి పరిణామాలను గమనిస్తే అధికారపార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి నేతృత్వంలోనే కథ, స్క్రీన్‌ప్లే నడుస్తున్నాయనేది తేటతెల్లమవుతోంది. ఈ అధికార పార్టీ ప్రజాప్రతినిధి మొదటిగా వైసీపీకి చెందిన నేరచరిత్ర గల నాయకుడిని ముందు పెట్టగా వ్యతిరేక విమర్శలు రావటంతో మచిలీపట్నంకు చెందిన మరొక వ్యక్తితో దరఖాస్తు చేయించడం జరిగిందంటున్నారు. మొత్తంగా బుసక పేరుతో ఇసుకను తవ్వి సొమ్ము చేసుకోవాలనే తపన మాత్రమే వీరిలో కనపడుతుండగా, అధికారులు సైతం అడ్డగోలుగా సర్వే చేసి సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న కలెక్టర్ బాలాజీ

కొత్త ఏడాది.. సందడి

మచిలీపట్నం టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ, జనసేన నేతలు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, కేకులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావుతో పాటు ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక అధికారి షాహెద్‌బాబు, కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్, డీఎస్పీ అబ్దుల్ సుబాన్, ఆర్డీవో, తహసీల్దార్లు, వివిధ నియోజకవర్గాల కూటమి నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి రవీంద్రకు శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ గంగాధరరావు

అనాథ శవానికి అంతిమ సంస్కారం

జగ్గయ్యపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్‌లో యాచకురాలు అనారోగ్యంతో మృతిచెందగా జగ్గయ్యపేట ఎస్సై రాజు మానవత్వంతో స్పందించి అంతిమసంస్కారాలు జరిపించారు. మంగళవారం బస్టాండ్‌లో 45-50 సం.ల మధ్య వయస్సు మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. బస్టాండ్‌లో స్వీపర్ల ద్వారా సమాచారం అందుకున్న సామాజిక కార్యకర్తలు కిరణ్, వెంకట్‌లు జగ్గయ్యపేట ఎస్సై జి.రాజుకు విషయం తెలిపారు. వారి విచారణలో సంవత్సరం క్రితం తెలంగాణ ప్రాంతం నుంచి ఓ మహిళ కుమార్తెతో కలసి వచ్చిందని, బస్టాండ్‌లోనే యాచన చేస్తూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. మృతురాలి కుమార్తె అమాయకంగా ఉంటుందని, లోకజ్ఞానం లేదని చెప్పారు. ఎస్సై చొరవతో సామాజిక కార్యకర్తలు కిరణ్, వెంకట్‌లు పారామౌంట్ సంస్థ ఉచిత వాహనంలో స్మశానానికి చేర్చి అంతిమ కార్యక్రమాలు పూర్తిచేశారు. మానవత్వంతో స్పందించిన ఎస్సై రాజును, చొరవ తీసుకున్న కిరణ్, వెంకట్‌లను స్థానికులు అభినందించారు.



మహిళ భౌతికకాయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు, ఖననం చేస్తున్న కార్యకర్తలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

మహిళా ఉద్యోగులకు ఐదు అదనపు సెలవులు ఇవ్వాలి

గన్నవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న మహిళ ఉద్యోగులకు సాధారణ సెలవులతో పాటు అదనంగా మరో 5 రోజులు సెలవులు మంజూరు చేయాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవి కుమార్‌కు బుధవారం వినతిపత్రాన్ని గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ నాయకులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అదనపు సెలవులు ఇవ్వాలని కోరినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కె.కృపానందం తెలిపారు. నాయకులు తోకల రాంబాబు, కేవీ సుబ్బ మణ్యేశ్వరరావు, సాలార్ షరీఫ్, షేక్ రహీమ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేంకటేశ్వరస్వామికి పండ్లతో అలంకారం



పెనమలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం సందర్భంగా తాడిగడప లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో స్వామివారిని బుధవారం పండ్లతో అలంకరించారు. ఈ నెల పదిన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, స్వామివారిని నవనీతాలంకారంలో దర్శించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంగానమ్మకు పూజలు



ఉయ్యూరు : తెలుగుదేశం, కూటమి పార్టీలు ఎన్నికల్లో విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం పట్ల కొల్లిపర రమేశ్, పద్మావతి దంపతులు గంగానమ్మకు మొక్కు తీర్చుకున్నారు. గత సంవత్సరం జూన్‌లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గంగానమ్మకు మొక్కుకున్న రమేశ్ దంపతులు గంగానమ్మకు మంగళవారం గొర్రెపొటేలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.



బాబా ఆలయంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లిలోని సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108 లడ్డూలతో అర్చకుడు శ్రీనివాసరావు బాబా వారికి అష్టోత్తర శతనామావళి పూజలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మి, పద్మశ్రీ, మాచినేని సాయికృష్ణ, శివ కుమార్, వెంకటరమణ, సుబ్బారావు పాల్గొన్నారు.

మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు రేపు

పెనమలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని మాజీ సైనిక సంఘ నాయకులందరూ కలిసి ఒకతాటిపైకి వచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 3న జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఏర్పాటు చేసుకోనున్నట్టు జేఏసీ కార్యవర్గం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల మూడున పది గంటలకు విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వద్ద ఉన్న రిలయన్స్ ట్రెండ్స్ పైన ఉన్న హాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఏపీ రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం, మాజీ సైనికుల హక్కుల పోరాట సమితి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నాయకులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఉయ్యూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మొక్కలునాటి సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తెరగాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొలసాని రవి కుమార్ అన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సంస్థ సభ్యులతో కలసి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చేవూరి రవి సుధాకర్, నాగకుమార్, మహంకాళి పవన్ ఫణికుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


నిరుపేదలకు దుప్పట్లు, పండ్లు అందజేస్తున్న ఉషారామా విద్యార్థులు

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

ఉంగుటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకుని, సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవటం ద్వారా యువతకు మార్గదర్శకులుగా నిలవాలని తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం వివిధ ప్రాంతాల్లో రోడ్లపక్క, ఫుట్‌పాత్‌లపై అనాథలుగా పడుకుని వున్న నిరుపేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. గన్నవరం, తేలప్రోలు, రామవరప్పాడు, బెంజిసర్కిల్, వన్‌టౌన్, నూజివీడు, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో సుమారు 300మంది పేదలకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.శ్రీహరిబాబు పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని బీబీగూడెం కెరుస్సో మెషినరీ బాప్టిస్టు ఆధ్వర్యంలో వృద్ధులకు, పేదలకు చీరలు, దుప్పట్లను 78మందికి బుధవారం పంపిణీ చేశారు. సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ డేవిడ్ డి.రాజు మాట్లాడుతూ, ప్రతి ఏడాది గ్రామంలోని వృద్ధులకు, పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.


తాడిగడప ఎన్టీఆర్ రైతు బజార్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్


వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అభివృద్ధి, సంక్షేమం వేగవంతం

నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఈ నూతన సంవత్సరంలో రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం మరింత వేగవంతం అవుతుందని ఆకాంక్షించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు, కూటమి నాయకులు అధిక సంఖ్యలో వచ్చి పూల బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


గన్నవరం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


విద్యానగర్‌లో కేక్ కట్ చేస్తున్న న్యాయవాది రమణ

స్థానిక విద్యానగర్‌లో కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును ప్రముఖ న్యాయవాది, అసోసియేషన్ అధ్యక్షులు కేవీ రమణ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ వీవీవీ ప్రసాద్‌ను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కేవీఆర్ కిషోర్‌తో పాటు తోట వెంకయ్య, చిట్టినేని వెంకట్రావు, అబ్బాస్, రాధాకృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

తాడిగడప ఎన్టీఆర్ రైతు బజార్‌లో..

పెనమలూరు : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు వేడుకగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పోరంకి టీడీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను వివిధ కూటమి పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. తాడిగడపలోని ఎన్టీఆర్ రైతు బజార్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నూతన సంవత్సర కేకును కోసి పంచిపెట్టారు. నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరాదిలో నియోజకవర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

వైవీబీకి శుభాకాంక్షలు..

ఉయ్యూరు : మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉయ్యూరు మాజీ చైర్మన్ అబ్దుల్ ఖుద్దూస్, శివాలయం చైర్మన్ మోదుగుమూడి కుటుంబరావు, పార్టీ నాయకుడు అల్‌రియాజ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, 5వ వార్డు కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి, అజ్మ తుల్లా, జంపన శ్రీనివాస్ తదితరులు రాజేంద్రప్రసాద్‌ను బుధవారం ఆయన నివాసంలో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు.

● ముదునూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పాలడుగు సత్యనారాయణ రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సారథి, ఎమ్మెల్యేలు బోడెప్రసాద్, వెంకట్రావును బుధవారం కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసినట్టు తెలిపారు.


శ్రవంతి ట్రస్టు కార్యాలయంలో కోలాటం

ఆలయాలు కిటకిట

హనుమాన్‌జంక్షన్ : నూతన సంవత్సర వేడుక సందర్భంగా స్థానిక అభయాంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి దేవస్థానాలు, శివాలయం బుధవారం భక్తులతో రద్దీగా మారాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జంక్షన్‌లోని పలు చర్చిల్లో మంగళవారం రాత్రి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక శ్రవంతి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకు కట్ చేసి ట్రస్టు చైర్మన్, కార్యదర్శి వీరమాచనేని సత్యప్రసాద్, శ్రీదేవి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సాయి కోలాటం బృందం భక్తి పాటలతో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ట్రస్టు సభ్యులు వీరమాచ నేని బుజ్జి, డి.వి.రమణ, మేడేపూడి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

రంగన్నగూడెంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రంగన్నగూడెంలోని సీఎస్‌ఐ చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ పాల్గొని కేక్‌కట్ చేశారు. తదనంతరం తన సొంత నిధులతో 40మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, టీడీపీ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు కనకవల్లి శేషగిరిరావు, సీఎస్‌ఐ చర్చి కమిటీ సభ్యులు దోమవరపు బాబూరావు, ఇలపర్తి సంసోను, తలారి యోహాను, అలుగుల ఆనంద్‌బాబు, కనకవల్లి యాకోబు పాల్గొన్నారు.


ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాల విద్యార్థులతో విజయ డెయిరీ చైర్మన్ చలసాని

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచి ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని చాటాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో అనాథ దివ్యాంగులకు సేవలందిస్తున్న నిర్వాహకులు మాధవీలత, వెంకటస్వామిలను అభినందించారు. కృష్ణా మిల్క్ యూనియన్ తరుపున దివ్యాంగులకు రొట్టెలు బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో దివ్యాంగులు శాపగ్రస్తులుగా మిగిలి పోకుండా ఆదరించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, హనుమాన్‌జంక్షన్, పామర్రు, గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రాల మేనేజర్లు ఎం.హరిబాబు, గోపీనాధ్, సత్యనారాయణ, స్థానిక టీడీపీ నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, కొల్లి వెంట్రావు పాలశీతల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కందలంపాడు వైసీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలంలోని కందలంపాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో టీడీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ప్రధానంగా గుంతలమయమైన ప్రధాన రహదారులను రూ. 54 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు. కందలంపాడు గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు మొవ్వ నరేష్ ఆధ్వర్యంలో కొత్తూరు జాన్ వర్రె బాబూరావు, కొత్తూరు నాగరాజు, బుజ్జి బాబు, పులి కళ్యాణ్, నిమ్మగడ్డ ఆంతోని, దొప్పలపూడి ఇస్సాన్, నాగేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పార్టీలో చేరారు.


అముదాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావుకు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఎఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

ఉంగుటూరు / హనుమాన్ జంక్షన్ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేసరపల్లిలో ఈనెల 5న జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన ప్రచారరథం బుధవారం మండలంలోని ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ముక్కపాడు, లంకపల్లి అగ్రహారం, ఓండ్రంపాడు, పొణుకుమాడు, గారపాడు తదితర గ్రామాల్లో పర్యటించింది. ఆముదాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావుకు ఆహ్వానపత్రికను అందజేసి హైందవశంఖారావ సభకు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధులు ఎదురువాడ శ్రీనివాసరావు, యడవల్లి పాండురంగారావు, కృష్ణవేణి, పటమట అర్జునరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కానుమోలు, కె.సీతారాంపురం గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రచారరథం ద్వారా ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటికీ ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విహార్ సిబ్బంది, సమరసత సేవా ఫౌండేషన్ మండల సహకన్వీనర్ తట్టి సుబ్బారావు, మలిశెట్టి నాని, శివనాగబాబు, వనజారాణి, కుమారి పాల్గొన్నారు.



కానుమోలులో హైందవ శంఖారావం ప్రచార రథం

ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించాలి

గన్నవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించాలని తహసీల్దార్ కేవీ శివయ్య అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావుతో కలసి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ, వృద్ధులు మన జాతి సంపదన్నారు. వృద్ధులను ఆదరిస్తేనే నేటితరం మనలను ఆదరిస్తుందన్నారు. వృద్ధాశ్రమంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ (బుజ్జి), రిటైర్డ్ అధ్యాపకులు గన్నె వెంకట్రావు, వీఆర్వో గోపాలరావు, రవీంద్ర పాల్గొన్నారు.


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ కేవీ శివయ్య

చెన్నైకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ టీటీ జట్టు


ఎంపికైన టీటీ జట్టుతో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ నర్సింహం

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై అమిత్ యూనివర్సిటీలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ మహిళా చాంపియన్ షిప్‌లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ జట్టు బయలు దేరిందని స్పోర్ట్సు వర్సిటీ బోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జట్టులో కె.మేఘన, వీ శ్రీకరి(శ్రీకాకుళం గ్రేటర్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్), యు.రుషిత, వి.శ్రీనవ్య తేజస్వి(విశాఖపట్నం గాయత్రి విద్యాపరిషత్ ఇన్‌స్టిట్యూట్ హెల్త్‌కేర్ మెడికల్ టెక్నాలజీ), బి.జయశ్రీ(రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ)లో ఉన్నారు. వీరిని వైస్ చాన్సలర్ డాక్టర్ డీవీఎస్ఎల్ నర్సింహం, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, కంట్రోలర్ ఎగ్జామినేషన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.550

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

కోడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల క్రితం నక్కవానిదారి గ్రామానికి చెందిన అప్పికట్ల ఆంజనేయులుకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమవడంతో బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ చేయూతనందించింది. బుధవారం సొసైటీ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కృష్ణాజిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సమకూర్చిన గృహోపకరణాలు, టార్పాలిన్(పట్టా), మండల శాఖ చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు సహకారంతో 25 కేజీల బియ్యం, కూరగాయలు అందజేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం

● నగరవాసులంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం: మంత్రి కొల్లు రవీంద్ర



పారిశుధ్య నిర్వహణ కోసం నగరపాలక సంస్థ రూ.35 లక్షలతో కొనుగోలు చేసిన జేసీబీని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరవాసులంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఇందులో భాగంగా రూ.35 లక్షలతో జేసీబీ కమ్ డోజర్‌ను కొనుగోలు చేశామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసిన యంత్రాన్ని తన ఇంటి వద్ద మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం ప్రారంభించారు. స్వయంగా యంత్రాన్ని నడిపారు. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు కమిషనర్ బాపిరాజు, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గోకుల శివ, ఎండీ ఇలియాస్ పాషాతో పాటు ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, మునిసిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

క్యాంపుబెల్‌పేట కాజ్‌వే మరమ్మతులకు రూ. 25 లక్షలు

మచిలీపట్నం టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బందరు మండలం క్యాంపుబెల్‌పేట గ్రామంలోని కాజ్‌వే మరమ్మతులకు ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసిందని గ్రామ మాజీ సర్పంచ్ వల్లభుని నాగుల్‌మీర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడండి

● 'యువకెరటాలు' ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ బాలాజీ



హిందూ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హిందూ కళాశాల క్రీడా ప్రాంగణంలో జనవరి 3,4 తేదీల్లో నిర్వహించనున్న యువకెరటాలు కార్యక్రమంలో పాల్గొనేందుకు వేలాది మంది విద్యార్థులు వస్తున్నందున వారికి ఏ అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. హిందూ కళాశాల ప్రాంగణంలో యువకెరటాలు కార్యక్రమ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. మెప్మా పీడీ సాయిబాబు, ఎంఈవో దుర్గాప్రసాద్, ప్రైవేట్ పాఠశాలల సంఘ రాష్ట్ర నాయకులు కొమరగిరి చంద్రశేఖర్, వి.సుందరరాం, నిర్వాహకుడు ఆనంద్, పోలీసు అధికారులు, మునిసిపల్ ఇంజనీర్లు, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.


సుబ్బారాయుడి సేవలో గ్రెనడా హై కమిషనర్



గ్రెనడా హై కమిషనర్ పసుపులేటి గీతా కిషోర్‌కుమార్‌కు స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు

మోపిదేవి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెస్టిండీస్ (గ్రెనడా) హై కమిషనర్ ఆఫ్ రిపబ్లిక్ ఆఫ్ ఇండియా పసుపులేటి గీతా కిషోర్‌కుమార్ శనివారం ఉదయం విచ్చేశారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశాక, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో ఆయనను సత్కరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు అందజేశారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి



ఘంటసాలలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు

ఘంటసాల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ నగర్‌లో బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నిరసన తెలిపారు. బలే కోటేశ్వరరావు, బలే రమేష్, గద్దె నాగేశ్వరరావు, అయినపూడి గాంధీ, దగాని వెంకటేశ్వరరావు, పాతపాటి ప్రసాద్, గంజి రఫీ, పి.రాహుల్ పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ

అవనిగడ్డ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గీతా మందిరంలో గోదాదేవి అమ్మవారికి బుధవారం సారె సమర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మంది భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు, పలు రకాల మిఠాయిలు, చలిమిడి, పండ్లను అమ్మవారికి సమర్పించారు. మహిళలు అమ్మవారికి అష్టోత్తర శతనామార్చనలు, సువర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ తుంగల సుమతిదేవి, అరుణ కుమారి, మల్లికాంబ, అన్నపూర్ణ, లక్ష్మీ తాయారమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గీతామందిరంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు



అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న అభిమానులు



నాగేశ్వరరావుపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



బందరులో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నేత హసీంబేగ్



బందరులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు

అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు

2024 సంవత్సరానికి మంగళారం అర్ధరాత్రి ప్రజలు ఘన వీడ్కోలు పలికి, 2025కు ఘనస్వాగతం చెప్పారు. అన్ని ప్రాంతాల్లోనూ అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాప్రతినిధులు, నాయకులకు శుభాకాంక్షల వెల్లువ

మచిలీపట్నం టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును ఇంటివద్ద వివిధ ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, ఆర్టీసీ అధికారులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణను పలువురు రైతులు కానూరు గ్రామంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా 14వ డివిజన్ సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ నూతన వస్త్రాలు బహూకరించారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌ను ఆయన ఇంటి వద్ద పలువురు టీడీపీ, జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు వేదవ్యాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బొకేలు, దండలు, శాలువాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కార్యాలయంలో..

అవనిగడ్డ: ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు నియోజకవర్గానికి చెందిన అభిమానులు, బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉపాధ్యాయ సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్‌కుమార్, తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో..

టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ కార్యాలయంలో ఎన్ఆర్ఐ, పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ నేతృత్వంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆరు మండలాల నుంచి పార్టీ ముఖ్యనేతలు, అభిమానులు తరలివచ్చారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాస్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మండవ బాలవర్ధిరావు, బండే రాఘవ, బండే శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, విశ్వనాథపల్లి పాప, రావి నాగేశ్వరరావు, మెండు లక్ష్మణరావు, నిడమానూరి దిలీప్ కుమార్, మోర్ల రాంబాబు, బండే కనకదుర్గ పాల్గొన్నారు.

విక్కుర్తి శ్రీనివాస్ కార్యాలయంలో..

పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ కార్యాలయంలో అభిమానులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విక్కుర్తికి అభిమానులు, టీడీపీ నేతలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ కార్యాలయంలో..

వైసీపీ అవనిగడ్డ నియోజకవర్గ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కేక్ కట్ చేశారు. భారీ సంఖ్యలో విచ్చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సింహాద్రికి శుభాకాంక్షలు తెలిపారు.

భారీ కేక్ కటింగ్

కోడూరు: టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. వివిధ గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణ, పూతబోయిన కరుణకుమార్, బచ్చు వెంకటేష్, గాదె రమేష్, నాగం రఘు, మేడ శివాజీ, వేములపల్లి రాజేష్, గోగినేని సోమశేఖరరావు, కోట రాంబాబు, పూతబోయిన సీతారత్న సాయిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాసంలో..

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేటలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాసంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. టీడీపీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రోడ్లు కిక్కిరిసిపోయాయి. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అందరి కుటుంబాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయాధికారి అరుణసారిక

మచిలీపట్నం టౌన్: జిల్లా కోర్టులో బుధవారం జిల్లా కోర్టు ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను జిల్లా న్యాయాధికారి అరుణసారిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నం 14వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ



టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ కార్యాలయంలో పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నేతలు



కోడూరు ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, నాయకులు

చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

ఘంటసాల, జనవరి 1(ఆంధ్ర జ్యోతి): క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ సూచించారు. పర్ణశాల ఫెలోషిప్ చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్ క్విజ్ పోటీల్లో గెలుపొందిన చిన్నారులు, పెద్దలకు బహుమతులను తహసీల్దార్‌తో పంపిణీ చేయించారు. పాస్టర్లు కోలా దానియేలు, కోలా కృపావరం, ఎంఎస్ఆర్కే, రాజు, విశ్వాసులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



పర్ణశాల ఫెలోషిప్ చర్చిలో బైబిల్ క్విజ్ విజేతలతో తహసీల్దార్ విజయప్రసాద్



నాగాయలంక రక్షణసైన్యం చర్చిలో కేక్ కట్ చేస్తున్న పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్

రక్షణ సైన్యం చర్చిలో..

నాగాయలంక: రాజేశ్వరి కాలనీలో రక్షణ సైన్యం చర్చిలో పాస్టర్ రత్నం గుమ్మడి, సంఘ పెద్దల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు, విక్కుర్తి రాంబాబు పాల్గొని కేక్ కట్ చేశారు.

పురవీధుల్లో క్రైస్తవుల ర్యాలీలు

మోపిదేవి: తెల్లవారుజామున నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ క్రైస్తవులు పురవీధుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ర్యాలీ చేశారు. ఎంపీపీ రావి దుర్గావాణికి ఎంపీడీవో స్వర్ణభారతి, కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, పార్టీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

ఐవీఎం హోమ్‌లో..

చల్లపల్లి: పురిటిగడ్డ ఐవీఎం హోమ్(ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవా సంస్థ)లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్‌కుమార్ - రోజా దంపతులు సంస్థ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు జి.ప్రసాద్, ఎన్.ఫణి పాల్గొన్నారు.



పురిటిగడ్డ ఐవీఎం హోమ్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతులు

భక్తిశ్రద్ధలతో మరియ మాతృత్వ పండుగ





సాలిపేట చర్చిలో సందేశమిస్తున్న ఫాదర్ రవికుమార్, ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

చల్లపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సాలిపేట చర్చిలో బుధవారం మరియతల్లి మాతృత్వ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫాదర్ బి.రవికుమార్ క్రీస్తు శాంతి సందేశాలను అందజేశారు. మరియ దళ సభ్యులు ప్రార్థన గీతాలను ఆలపించారు. దివ్య బలిపూజ నిర్వహించారు. దివ్య సత్ప్రసాదం అందించారు. దివిసీమలోని 12 గ్రామాల ఉపదేశకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులను కొట్టారని ఉపాధ్యాయుడిపై మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బందరు మండలం తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను ఆ పాఠశాల ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడు దారుణంగా కొట్టాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు విశ్రాంత ఉపాధ్యాయుడు కలగా రామకృష్ణ ఫిర్యాదుచేశారు. పురుష ఉపాధ్యాయుడు విద్యార్థినులను కొట్టడం సరికాదని అందులో పేర్కొన్నారు. డైరెక్టర్ దేవానందరెడ్డి దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు.



చల్లపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

మార్మోగిన గోవింద నామస్మరణ

చల్లపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలు, నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తుల గోవింద నామ స్మరణతో మార్మోగింది. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామిని, గోదాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి, స్వామి, అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు.



రామానగరంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం

చల్లపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రామానగరంలోని శ్రీజాంబవంత ఆంజనేయ ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జై శ్రీమన్నారాయణ భజన బృందం, బచ్చు సీతారామాంజనేయులు, స్థానిక భక్తులు, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

మార్మోగిన గోవింద నామస్మరణ

చల్లపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలు, నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తుల గోవింద నామ స్మరణతో మార్మోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామిని, గోదాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి, స్వామి, అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు.





ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్ మైఖేల్

కొత్త ఏడాది అందరికీ శుభం కలగాలి

● ఫాదర్ మైఖేల్

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో ప్రజలందరికీ శుభం కలగాలని ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. మంగళవారం అర్ధ రాత్రి నుంచి స్థానిక ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్ ఆర్‌సీఎం దేవాలయం, కోతి బొమ్మ సెంటర్‌లోని అవిలాపూరి చిన్న తేరెజమ్మ ఆర్‌సీఎం-2 దేవాలయాల్లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో మతాలకతీతంగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా చర్చిల ఫాదర్లు గుజ్జుల మైఖేల్, శ్రీకాంత్, ఎం.లూయిస్‌రాజు, తోట మరియదాసు నూతన సంవత్సర సందేశాన్ని అందించారు. కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, బెజ్జం సువర్ణరాజు, సభ్యులు సెబాస్టియన్, ఆంతోని, క్రీస్తురాజు, భాస్కర్, ఇంటి స్వామిదాసు, వి.జీవరత్నం, విచారణపరిధిలోని సిస్టర్స్, ఉపదేశకులు, చిన్నారులు, భక్తులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

కేంద్రానికి మద్దతునివ్వడం శోచనీయం

● సీపీఎం నేత ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తున్నా రాష్ట్ర అభివృద్ధి బాటలు వేయని దుస్థితి నెలకొందని, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్న అధికార, ప్రతిపక్షాలు కేంద్రానికి మద్దతుగా నిలుస్తుండటం శోచనీయమని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యాభవన్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న సమయంలో కొన్ని మతతత్వ శక్తులు రాష్ట్రంలో మతాలు పేరుతో దాడులు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలుగా మారుతున్నారని ఆరోపించారు. తెలుగు జాతి అంతా ఐక్యంగా సోదరభావంతో మెలిగి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. నేతలు పల్లపు ప్రభుదాసు, రేపాని కొండ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న యలవర్తి, రంగప్రసాద్

స్టేడియం క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలు

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన 35వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం జిమ్‌కు చెందిన కాళి చరణ్ రుత్విక్ 66 కేజీల శరీర బరువు విభాగంలో బంగారు పతకం, 53 కేజీల శరీర బరువు విభాగంలో నల్లగొండ లీల అజయ్ వెండి పతకం సాధించినట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక స్టేడియం ఆవరణలో పతకాలు సాధించిన వారిని అభినందించారు. పతకగ్రహీలను, కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు, జంపా ఉపాకుమారిని స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, మేనేజర్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు అభినందించారు.



గాంధీ విగ్రహం వద్ద మర్రి మొక్కను నాటిన లయన్స్ ప్రతినిధులు

మర్రి మొక్కను నాటిన 'లయన్స్'

గుడ్లవల్లేరు, జనవరి, 1 (ఆంధ్రజ్యోతి): పురాతన వృక్ష జాతికి చెందిన వృక్షాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో తరువాత తరాలకు వాటిని చూపాలనీ, వాటి విశిష్టత తెలపాలన్న ఉద్దేశంతో గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ వారు మర్రి మొక్కను బుధవారం నాటారు. గతంలో స్థానిక చెరువుగట్టు గాంధీ విగ్రహం వద్ద ఎన్నో ఏళ్ల మర్రి వృక్షం ఉండేది. కానీ రహదారి విస్తరణ సమయంలో దాన్ని తొలగించారు. అయితే అదే ప్రదేశంలో తిరిగి ఒక మర్రి మొక్కను నాటాలని లయన్స్‌క్లబ్ సభ్యుడు పెంటపాటి చిట్టిబాబు సంకల్పించి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కను నాటి దాని సంరక్షణకు ఐరెన్ ట్రీ గార్డ్‌ను ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు శశికళ, కార్యదర్శి పెరుమాళ్లు, కోశాధికారి నవాబు, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైసీపీ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేషనల్ గ్రీన్ క్రాప్స్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి

ఒత్తిడి లేని విద్యావిధానం ఉత్తమం

● నేషనల్ గ్రీన్ క్రాప్స్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేకుండా విద్యను బోధించడం ఉత్తమమని నేషనల్ గ్రీన్ క్రాప్స్ రాష్ట్ర డైరెక్టర్ పసుపులేటి స్రవంతి అన్నారు. మంగళవారం స్థానిక విద్యాలయ, వికాస్ రెయిన్‌బో పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు ఎన్విరాన్‌మెంట్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసం పొందాలన్నారు. నూరు శాతం ఫలితాలను ప్రతి పాఠశాల సాధించాలన్నారు. ఎంఈవో బాలాజీ, విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, వికాస్ రెయిన్‌బో కరస్పాండెంట్ పుట్టి రామచంద్రశేఖర్, సీఆర్‌పీ నాగలక్ష్మీ, నేషనల్ గ్రీన్ కార్ప్ ప్రాజెక్టు అధికారి గుత్తా సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. పట్టణ, తాలుకా సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు ఎమ్మెల్యే వెనిగండ్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజావేదికలో పార్టీ నేతలు, కార్యకర్తల మధ్యలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో, పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ శుభం కలగాలి: రావి

కొత్త ఏడాదిఏడాదిలో నియోజకవర్గ ప్రజలందరికీ శుభం కలగాలని, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో, సంతోషంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.

రైతులకు, కార్మికులకు మేలు జరగాలి: నుగలాపు

స్థానిక ఆటోనగర్‌లోని శ్రీశ్రీనివాస ఆటో ఇంజినీరింగ్ వర్క్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు, శ్రీనివాస ఇండస్ట్రీస్ డైరెక్టర్ నుగలాపు సురేష్‌బాబు పాల్గొన్నారు. తొలుత నుగలాపు కేక్ కట్ చేశారు. అనంతరం నుగలాపును పలువురు కార్మికులు ఘనంగా సత్కరించారు. నుగలాపు సేవా సమితి సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.





వెనిగండ్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి 25 కేజీల కేక్ కట్ చేస్తున్న గుడ్లవల్లేరు టీడీపీ నేత వెంకట్రావు తదితరులు

గుడ్లవల్లేరులో...

గుడ్లవల్లేరు: నూతన సంవత్సర వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. స్నేహితులు, బంధువులు, అధికారులు, నాయకులు ఇలా ఒకరినొకరు కలుసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, అలానే ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావును మండల పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భారీ కేక్ కట్‌చేసిన ఎమ్మెల్యే

2025వ సంవత్సరం రావడంతో 25 కిలోల కేక్‌ను ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు ఏర్పాటు చేశారు. గుడ్లవల్లేరు టీడీపీ తరపున గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతులమీదుగా కేక్‌ను కట్ చేయించారు. గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పొట్లూరి రవి కుమార్, పోలవరపు వెంకటరావు, పిచ్చేశ్వరరావు,అట్లూరి స్వరూప్, డీసీ చైర్మన్ చలసాని శ్రీధర్, దివ్వా చౌదరి పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

గుడివాడ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఎంపీపీ గద్దె పుష్పరాణి ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో డివై.విష్ణుప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎంఈవోలు బాలాజీ, విజయన్ తదితరుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ యూనియన్ నాయకులు ఎంపీపీ, ఎంఈవోలను కలసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.



ఎంపీపీ గద్దె పుష్పరాణికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో, కార్యదర్శులు, సిబ్బంది

ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తా





పామర్రులో న్యూ ఇయర్ కేక్ కట్‌చేసి అందరికీ పంచుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా దంపతులు, చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ చంద్రశేఖర్

● ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలు నేరవేరేలా.. ప్రజలు, అధికారుల సహాయంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కుమార్‌రాజా సతీమణి విశ్రామతో కలిసి కేక్ కట్‌చేసి అందరికీ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించే బాధ్యత అధికారులు తీసుకోవాలని కోరారు. తొలుత ఎమ్మెల్యేకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన పార్టీనేతలు, శాఖల అధికారులు, కూటమి నేతలు స్వీట్స్, పూలబోకేలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాస్, తాడిశెట్టి సాంబ శివరావు, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జక్కా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ ఎంపీడీవో కే జ్యోతితో కలిసి కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కేక్ కట్‌చేసి ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలకు అందజేశారు. ఐదు మండలాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

కూచిపూడి: ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పెదపూడి బేతేలు చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ సలోమి, సంతోష్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, తాతా ప్రభాకర్‌రావు, పెదపూడి, కూచిపూడి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

నూతన సంవత్సర వేడుకలు అంబర్నాంటాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే యువత పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకున్నారు. మహిళలు వాకిళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది వాటికి రంగులద్ది కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మండల పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు.

ఆనందోత్సాహాలతో కొత్త సంవత్సర వేడుక

ఉయ్యూరు: పమిడిముక్కల మండలంలో నూతన సంవత్సర వేడుక ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ మంగళవారం రాత్రి యువకులు ఉత్సాహంగా రోడ్లపైకి వచ్చి టపాసులు కాల్చారు. మహిళలు, యువతులు వాకిళ్లలో రంగు రంగుల రంగవల్లులు దిద్దారు స్వీట్ షాపులు, బేకరీలు కిటకిటలాయి. రోడ్డు వెంబడి పలావు దుకాణాలు వెలవగా యువకులు భారీగా కొనుగోళ్లు చేయడంతో రాత్రి 10 గంటలకే ఖాళీ అయ్యాయి.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

తోట్లవల్లూరు: మండలంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మరనాత విశ్వాస సమాజం చర్చిలో మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు వల్లూరు చంద్రశేఖర్ నూనత సంవత్సర కేక్‌ను కట్ చేశారు. పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అలాగే పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర వేడుకలు జరిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడికి చెందిన టీడీపీ నేత నత్తా వాణి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతోపాటు పలువురు నేతలు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లల సృజనాత్మకతకు అద్దం.. సైన్స్ ఎగ్జిబిషన్

● డీఈవో రామారావు

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పిల్లల సృజనాత్మకతకు అద్దంపట్టేలా ఎగ్జిబిట్స్ ఉండాలని, జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ఆదేశించారు. బుధవారం స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి సైన్ ప్రదర్శన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. డీఈవో రామారావు నేతృత్వంలో గుడివాడ డీవైఈవో ఐ.పద్మారాణి, మచిలీపట్నం డీవైఇవో బీఎస్‌సి సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఒకరోజు నిర్వహించే జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనల ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ, యాజమాన్య పాఠశాల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, ఎర్త్/స్పేస్ సైన్స్, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, బయోసైన్స్/బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో అంశాలను తీసుకుని ప్రదర్శనలను సిద్ధం చేసుకున్నారన్నారు. ముఖ్యంగా సైన్స్ ప్రదర్శనల్లో ప్రాజెక్టులు, నమూనాలు, ప్రయోగాలు, వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. చార్టులు, థర్మాకోల్, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించామన్నారు. విజేతలైన విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రదర్శనలు రాష్ట్ర, దక్షిణ భారతదేశ స్థాయిల్లో జరిగే పోటీలకు ఎంపికవుతారన్నారు. న్యాయ నిర్ణేతలు మూడు విభాగాలుగా ప్రదర్శనలను పరిశీలించి విజేతలను ఎంపిక చేస్తారన్నారు. ఉపాధ్యాయ ప్రదర్శన, విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శన, విద్యార్థుల గ్రూపు ప్రదర్శన విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనలను మాత్రమే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికవుతాయని డీఈవో రామారావు తెలిపారు.



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

విజయవంతానికి 8 కీలక కమిటీలు

జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనను విజయవంతం చేసేందుకు 8 కీలక కమిటీలను ఏర్పాటుచేశారు. ఇన్విటేషన్ అండ్ రిసెప్షన్ కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీ, కల్చరల్ అండ్ డెకరేషన్ కమిటీ, డిస్‌ప్లే కమిటీ, క్రమశిక్షణ కమిటీ, ఆహార కమిటీ, డాక్యుమెంటేషన్ అండ్ పబ్లిసిటీ కమిటీ, బహుమతి ప్రధాన కమిటీల్లో అనుభవం కలిగిన ఎంఈవోలు, ఉపాధ్యాయులను నియమించారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి మహ్మమద్ జాకీర్ అహ్మద్, గుడివాడ డీవైఇవో ఐ పద్మారాణి, మచిలీపట్నం డీవైఇవో బీఎస్‌సీ సింగ్, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి సేవలో గ్రెనడా హై కమిషనర్

మోపిదేవి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెస్టిండిస్ (గ్రెనడా) హై కమిషనర్ ఆఫ్ రిపబ్లిక్ ఆఫ్ ఇండియా పసుపులేటి గీతా కిషోర్‌కుమార్ శనివారం ఉదయం విచ్చేశారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో ఆయనను సత్కరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.